సింధు, సాయి నిశ్చితార్థం

ఈనెల 22న వివాహ వేడుక

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుకు పెండ్లి కళ వచ్చేసింది. ఇప్పటికే ముహూర్తాలు ఖరారు కాగా, శనివారం హైదరాబాద్‌లో సింధు, వెంకటదత్త సాయి నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. ఇరు కుటుంబాలకు చెందిన అత్యంత సన్నిహితుల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో ఇద్దరు ఉంగరాలు మార్చుకున్నారు. ఈనెల 22న ఉదయ్‌పూర్(రాజస్థాన్)లో వివాహం జరుగనుండగా, 24న హైదరాబాలో రిసెప్షన్ ఏర్పాటు చేసినట్లు సింధు తండ్రి పీవీ రమణ పేర్కొన్నారు. ఇప్పటికే ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షా, క్రికెట్ దిగ్గజం సచిన్‌తో పాటు పలువురు ప్రముఖులను స్వయంగా కలిసిన సింధు తన పెండ్లి ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ప్రత్యేకంగా కలిసిన సింధు పెండ్లి పత్రిక అందజేసింది. ఈ కార్యక్రమంలో సింధు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుకేశ్ గెలుపు, ఐటీకి శుభాకాంక్షలు!

మంత్రి సీతారామన్‌పై సెటైర్లు

ముంబై: పిన్న వయసులో ప్రపంచ చెస్ చాంపియన్‌గా నిలిచిన దొమ్మరాజు గుకేశ్‌పై ఓవైపు ప్రశంసల వర్షం కురుస్తుంటే మరోవైపు పన్నులు వెంటాడుతున్నాయి. డింగ్ లిరెన్‌పై అద్భుత విజయంతో మెగాటోర్నీలో విజేతగా నిలిచిన గుకేశ్‌కు ప్రైజ్‌మనీ కింద 11.34 కోట్లు దక్కాయి. దీనిపై సోషల్‌మీడియాలో సెటైర్లు నవ్వులు తెప్పిస్తున్నాయి. గుకేశ్ విజయం..ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు శుభాకాంక్షలు అంటూ సందేశాలు రాసుకొస్తున్నారు. ప్రైజ్‌మనీ కింద 11 కోట్లకు దాదాపు 5 కోట్ల మేర గుకేశ్ వద్ద పన్ను వసూలు చేస్తున్నారంటూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లక్ష్యంగా మెస్సెజ్‌లు పెడుతున్నారు. టీడీఎస్ అంటే 'ట్యాక్స్ డిడక్టెడ్ బై సీతారామన్' అంటూ కొత్త నిర్వచనం ఇస్తున్నారు. గుకేశ్ గెలుపు ప్రభుత్వానికి పన్ను అన్న రీతిలో సెటైర్లతో సోషల్‌మీడియాలో ఉతికి ఆరేస్తున్నారు.

ముంబై X మధ్యప్రదేశ్

బెంగళూరు: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో టైటిల్ పోరుకు రంగం సిద్ధమైంది. ఆదివారం ముంబై, మధ్యప్రదేశ్ మధ్య ఫైనల్ జరుగనుంది. టోర్నీలో ఇరు జట్లు అద్భుత ప్రదర్శన కొనసాగిస్తున్నాయి. రెండు అత్యుత్తమ జట్ల మధ్య పోరు అభిమానులను అలరించనుంది.

ఆసియా కప్ ఫైనల్లో భారత్

మస్కట్: మహిళల హాకీ జూనియర్ ఆసియకప్‌లో భారత్ ఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం జరిగిన సెమీస్‌లో యువ భారత్ 3-1తో జపాన్‌పై అలవోక విజయం సాధించింది. భారత్ తరపున ముంతాజ్‌ఖాన్ (4ని), సాక్షి రానా(5ని), దీపిక(13ని) గోల్స్ చేయగా, నికో మరుయమ(23ని) జపాన్‌కు ఏకైక గోల్ అందించింది. ఆదివారం జరిగే ఫైనల్లో చైనాతో భారత్ తలపడుతుంది.

వరుణుడిదే ఆట

తొలి రోజు వర్షం అంతరాయం

- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 28/0
- మూడో టెస్టుకు వాన గండం

బ్రిస్బేన్: భారత్, ఆస్ట్రేలియా మూడో టెస్టుకు వేదికైన బ్రిస్బేన్‌పై వరుణ మేఘాలు కమ్ముకున్నాయి. శనివారం మొదలైన టెస్టు తొలి రోజు ఆటకు వరుణుడు ఆటంకం కల్గించాడు. టాస్ గెలిచిన టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్‌శర్మ మరో ఆలోచన లేకుండా ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. మబ్బులు కమ్ముకున్న వాతావరణాన్ని అంచనా వేస్తూ ఆసీస్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. తేమతో కూడిన పిచ్‌పై టీమ్‌ఇండియా బౌలర్లను ఆసీస్ ఓపెనర్లు ఉస్మాన్ ఖవాజ(19 నాటౌట్), నాథన్ మెక్‌స్వీని(4 నాటౌట్) చాకచక్యంగా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా స్టార్ పేసర్ బుమ్రా స్పెల్‌ను జాగ్రత్తగా ఆడారు. ఏ మాత్రం తొందరపాటు కనబర్చకుండా క్రీజులో నిలదొక్కుకునేందుకు ప్రయత్నించారు. తొలి సెషన్‌లో ఒకింత తెరిపినివ్వడంతో 25 నిమిషాల వ్యవధిలో ఆసీస్ వికెట్ కోల్పోకుండా 19 పరుగులు చేసింది. అయితే ఆ తర్వాత ఎడతెరిపి లేకుండా వాన రావడంతో మైదానం మొత్తం చిత్తడిగా మారిపోయింది. బుమ్రాను జాగ్రత్తగా ఆడిన ఖవాజ, మెక్‌స్వీని..సిరాజ్, ఆకాశ్‌దీప్‌ను లక్ష్యంగా చేసుకుంటూ బౌండరీలు కొట్టారు. టెస్టులో మిగిలిన నాలుగు రోజులకు కూడా వర్షం అంతరాయం కల్గించనుందన్న వార్తల నేపథ్యంలో మూడో టెస్టుపై ఆసక్తి నెలకొన్నది. **ఇదిలా ఉంటే సిరాజ్‌ను లక్ష్యంగా చేసుకుంటూ ఆసీస్ అభిమానులు వెక్కిరించడంపై సునీల్ గవాస్కర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు.**

కివీస్ 315/9

ఇంగ్లండ్‌తో మూడో టెస్టు

హామిల్టన్(న్యూజిలాండ్): ఇంగ్లండ్‌తో మూడో టెస్టులో ఆతిథ్య న్యూజిలాండ్ ఇబ్బందుల్లో పడింది. టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ తొలి రోజు ఆట ముగిసే సరికి 9 వికెట్ల నష్టానికి 315 పరుగులు చేసింది. ఓపెనర్లు కెప్టెన్ టామ్ లాథమ్(63), విల్ యంగ్(42) శుభారంభంతో మెరుగ్గా కనిపించిన కివీస్ అదే ఒరవడి కొనసాగించలేకపోయింది. ఈ ఇద్దరు కలిసి తొలి వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మంచి పునాది వేశారు. అయితే ఇంగ్లండ్ పేసర్లు మాథ్యూ పాట్స్(3/75), అట్కిన్సన్(3/55) ధాటికి 172/2తో మెరుగ్గా కనిపించిన కివీస్ 231 పరుగులకు 7 వికెట్లు కోల్పోయింది. మిడిలార్డర్‌లో రచిన్‌రవీంద్ర(18), మిచెల్ (14), బ్లుండెల్(21), ఫిలిప్స్(5) విఫలమయ్యారు. ఆఖర్లో సాంట్నర్(50 నాటౌ ట్) రాణించడంతో మెరుగైన స్కోరు అందుకుంది.

గేల్ సరసన సౌథీ:

తన కెరీర్‌లో ఆడుతున్న కివీస్ వెటరన్ టిమ్ సౌథీ..వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ సరసన నిలిచాడు. టెస్టుల్లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్ల జాబితాలో గేల్(98)తో కలిసి సంయుక్తంగా సౌథీ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. కివీస్ తరపున 107వ టెస్టు ఆడుతున్న సౌథీ 10 బంతుల్లో మూడు సిక్స్‌లతో 23 పరుగులు సాధించాడు.

హెండ్రిక్స్ సూపర్ సెంచరీ

దక్షిణాఫ్రికాదే టీ20 సిరీస్

సెంచూరియన్(దక్షిణాఫ్రికా): పాకిస్థాన్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను దక్షిణాఫ్రికా మరో మ్యాచ్ మిగిలుండగానే సొంతం చేసుకుంది. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రెండో టీ20 పోరులో సఫారీలు 7 వికెట్ల తేడాతో పాక్‌పై ఘన విజయం సాధించారు. పాక్ నిర్దేశించిన 207 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 19.3 ఓవర్లలో 210/3 స్కోరు చేసింది. ఓపెనర్ రెజా హెండ్రిక్స్(63 బంతుల్లో 117, 7ఫోర్లు, 10సిక్స్‌లు) ధనాధన్ సెంచరీతో కదంతొక్కాడు. ఛేదనలో 28 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన దశలో డస్సెన్(38 బంతుల్లో 66 నాటౌట్, 3ఫోర్లు, 5సిక్స్‌లు)తో కలిసి హెండ్రిక్స్ ఇన్నింగ్స్‌ను గాడిలో పడేశాడు. వీరిద్దరు కలిసి పాక్ బౌలింగ్ దాడిని దీటుగా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా హెండ్రిక్స్ తన ఇన్నింగ్స్‌లో 10 సిక్స్‌లు, 7ఫోర్లతో విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో టీ20ల్లో హెండ్రిక్స్ తొలి సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. ఖాన్(2/40) రెండు వికెట్లు తీశాడు. తొలుత సయిమ్ ఆయూబ్(98 నాటౌట్) రాణించడంతో పాక్ 20 ఓవర్లలో 206/5 స్కోరు చేసింది. రెండు పరుగుల తేడాతో ఆయూబ్ సెంచరీ చేజార్చుకున్నాడు. గాలిమ్, బార్ట్‌మన్ రెండేసి వికెట్లు తీశారు. హెండ్రిక్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

2 దక్షిణాఫ్రికా టీ20 సిరీస్ గెలుపడం గత రెండేండ్లలో ఇది తొలిసారి. చివరిసారి ఆగస్టు 2022లో గెలిచింది.

1 ఇరు జట్ల మధ్య ఒక టీ20 పోరులో స్కోర్లు 416 నమోదు కావడం ఇదే తొలిసారి.

తెలంగాణ, రాజస్థాన్ పోరు డ్రా

సంతోశ్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక సంతోశ్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీలో ఆతిథ్య తెలంగాణకు డ్రా ఎదురైంది. శనివారం స్థానిక శ్రీనిధి దక్కన్ ఎరీనాలో తెలంగాణ, రాజస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిసింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు చెరో గోల్ చేశాయి. అంతకుముందు జరిగిన మరో మ్యాచ్‌లో మణిపూర్ 1-0తో సర్వీసెస్‌పై గెలిచి బోణీ కొట్టింది. తెలంగాణ, రాజస్థాన్ మ్యాచ్‌ను సాట్స్ చైర్మన్ శివాసేనా రెడ్డి అధికారికంగా ప్రారంభించారు. 57 ఏండ్ల తర్వాత సంతోశ్ ట్రోఫీకి తెలంగాణ ఆతిథ్యమిస్తున్నది.

నేడు, రేపు గ్రూప్-2 పరీక్షలు

- 1,368 పరీక్షాకేంద్రాల ఏర్పాటు
- 5.51లక్షల అభ్యర్థులు దరఖాస్తు
- హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నది 77% మాత్రమే

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): గ్రూప్-2 పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఆది, సోమవారాల్లో గ్రూప్-2 పరీక్షలు జరగనున్నాయి. నాలుగు పేపర్లకు రాష్ట్రవ్యాప్తంగా 1,368 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. 5,51,847 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 783 పోస్టుల భర్తీకి కేసీఆర్ ప్రభుత్వం గ్రూప్-2 నోటిఫికేషన్‌ను జారీచేయగా, పలు కారణాలతో పరీక్ష నాలుగుసార్లు వాయిదాపడింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30వరకు రెండో సెషన్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. 5.51లక్షల మంది అభ్యర్థుల్లో ఇప్పటి వరకు కేవలం 77% మంది అభ్యర్థులు మాత్రమే హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. లక్షకుపైగా అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోలేదు.

ప్రతి సెంటర్‌లో సీసీ కెమెరాలు: వెంకటేశం

గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు ప్రతి సెంటర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. శనివారం నాంపల్లిలోని కమిషన్ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ప్రతి అభ్యర్థి బయోమెట్రిక్ హాజరును నమోదుచేయాలని, లేదంటే జవాబుపత్రాన్ని తిరస్కరిస్తామని వెల్లడించారు. మార్చిలో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాలు విడుదల చేస్తామని పేర్కొన్నారు.

ఏ పుస్తకం చదవాలో అభ్యర్థి ఇష్టం

- టీజీపీఎస్సీ సిలబస్‌ను మాత్రమే ప్రకటిస్తుంది
- జాబ్ క్యాలెండర్ జాప్యంపై అధ్యయనం
- టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : టీజీపీఎస్సీ కేవలం సిలబస్ మాత్రమే ఇస్తుందని, ఏ పుస్తకం చదవాలన్నది అభ్యర్థుల ఇష్టమని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టంచేశారు. ఏ పుస్తకం ప్రామాణికమో చెప్పకూడదని తెలిపారు. జాబ్ క్యాలెండర్ జాప్యం కావడంపై అధ్యయనం చేస్తామని, ఈ అంశంపై స్పష్టత తీసుకుంటామని తెలిపారు. జాబ్ క్యాలెండర్‌లో ఏమున్నాయో చూసి, రిజర్వేషన్ల వల్ల ఆగిందా..? లేక మరేమైన కారణాలున్నాయా..? అన్నది స్టడీ చేస్తామని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కారణంగా జాబ్ క్యాలెండర్‌ను ప్రభుత్వం అమలుచేయడంలేదన్న వార్తలొచ్చాయి. దీంతోనే గత అక్టోబర్‌లో గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదలకాలేదు. జాబ్ క్యాలెండర్ ఎందుకు అమలు చేయడం లేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు బుర్రా వెంకటేశం పై విధంగా స్పందించారు. 18, 19న ఢిల్లీకి వెళ్లి యూపీఎస్సీ, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలతో భేటీ కానున్నట్టు పేర్కొన్నారు. జనవరిలో రాష్ట్రప్రభుత్వంతో భేటీ అయ్యి నివేదికను అందజేస్తామని వెల్లడించారు. ఆ తర్వాత

సంస్థాగత మార్పులు చేసి యూపీఎస్సీతో పోటీ పడేలా కమిషన్‌ను సిద్ధంచేస్తామని తెలిపారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.